ప్రజాశక్తి
బుధవారం 18 జనవరి 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఏలేరు.. వచ్చేనా నీరు?

- ఏళ్ల తరబడి ప్రతిపాదనల దశలోనే విశాఖకు తాగునీరు
- కాంట్రాక్టు పనులపై అధికార పెద్దల ఆసక్తి!
- రూ.1600 కోట్ల నుంచి రూ.2300 కోట్లకు... భారీగా పెరిగిన నిర్మాణ వ్యయం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



దేశంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో విశాఖ ఒకటి. 2001లో సుమారు 8.50లక్షలున్న జనాభా 2011 సంవత్సరం నాటికి 21లక్షలు దాటేసి ప్రస్తుతం 24లక్షలకు చేరిందన్నది అంచనా. నగర పరిధిలోకి గ్రామాల విలీనంతో నీటి ఎద్దటి తీవ్రం అవుతోంది. పరిసర గ్రామాల విలీనంతో మరింత మహానగరంగా విశాఖ మారిందన్నది తెలిసిందే. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ సంస్థలు, ఇతర వాణిజ్య, సేవా కార్యక్రమాల నిమిత్తం రోజుకు కనీసం లక్ష మంది వచ్చి పోతుంటారంటే ఆశ్చర్యం కలుగక మానదు. నగరాన్ని 2023 తాగునీటి సమస్య చుట్టుముట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. సంవత్సరాల తరబడి ఏలేరు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రతిపాదనలకే పరిమితం అవుతూ వస్తోంది. 2017లోనే ఇదిగో ఏలేరు నీరు అంటూ పాలకులు ప్రచారం చేశారు. 2018లో తీవ్రంగా మంచినీటి కొరత విశాఖలో ఏర్పడింది. 10ఏళ్ల క్రితమే రూ.1600 కోట్లతో ఈ ప్రాజెక్టు ప్రతిపాదన జరిగినా గత పాలకుల నిర్లక్ష్యం తోడై అడుగు ముందుకు పడలేదు. రూ.2300కోట్ల అంచనా వ్యయంతో కొత్త ప్రతిపాదనలు ముందుకొచ్చాయి.

ఏలేరుపై వాటర్ గ్రిడ్ మాత్రమే పరిష్కారం?

ఏలేరు రిజర్వాయర్‌పై వాటర్ గ్రిడ్ మాత్రమే విశాఖ ప్రజల దాహార్తిని తీర్చగలదన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. తాజాగా గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ రూ.2300కోట్లతో ప్రతిపాదనలను

మిగతా 2లో..



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లోకనాథం తదితరులు

నేటితరానికి జ్యోతిబసు జీవితం ఆదర్శం

వార్త 8లో..

నేడు లోక్‌నాయక్ ఫౌండేషన్ అవార్డుల ప్రదానోత్సవం

వార్త మెయిన్‌లో..

శాస్త్రీయ ఆవిష్కరణలతో అభివృద్ధి

వార్త మెయిన్‌లో..

గిరిజనుల హక్కులు కాపాడాలి

వార్త మెయిన్‌లో..

మొదటి పేజీ తరువాయి..

ఏలేరు.. వచ్చేనా నీరు?

సిద్ధం చేసింది. వాస్తవానికి ఈ పనుల కోసం నిధుల సాయాన్ని కొన్ని పరిశ్రమలు అందించేందుకు అంగీకరించాయి. దీంతో రాజకీయ నేతలు ఈ కాంట్రాక్టులు దక్కించుకునే దిశగా తాజాగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. 156 కి.మీ పొడవునా ఏలేరు ఎడమ ప్రధాన కాలువ విస్తరించింది. గోదావరి లేదా ఏలేరు జలాశయం నుంచి వైజాగ్‌కు నీటిని తీసుకొచ్చే ఓపెన్ కాలువ విడుదల చేసే నీటిలో 60శాతం మాత్రమే విశాఖ శివార్లలోగల నరవ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి వెళ్తున్నందున ఈ ప్రాజెక్టు ప్రతిపాదన జరిగింది. నీరు వచ్చే దారిలో పలు రకాల కారణాల వల్ల నీరు వృథా అవుతుందని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. పురుషోత్తపట్నం లిఫ్టు ఇరిగేషన్ స్కీం (పిఎల్ఐఎస్) కారణంగా ఏలూరు రిజర్వాయర్ గత ఏడాది పూర్తి సామర్థ్యంతో ఉంది. దీంతో ఏలేరు రిజర్వాయర్ నుంచి పొందిన నీటిని సక్రమంగా వాడుకోవాలని వాటర్ గ్రిడ్ ప్రణాళిక రచించబడింది. పంపింగ్ స్టేషన్‌లు, సర్వీస్ రిజర్వాయర్‌లు అభివృద్ధి చేయాల్సి ఉంది. దారి పొడవునా ప్రతి మండలంలోనూ ట్యాపింగ్ పాయింట్‌లు ఏర్పాటు చేయాలి.

సరిపడా నీరు ఎందుకు రావడం లేదు?

విశాఖకు అత్యధిక భాగం నీరు ఏలేరు జలాశయం నుంచి రావాల్సి ఉంది. తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తమపట్నం లిఫ్టు నుంచి గోదావరి నీరు ప్రస్తుతం వస్తోంది. ఏలేరు కాలువ ద్వారా ఈ నీరు విశాఖకు వస్తోంది. ఏలేరు కాల్వ నుంచి రోజుకు 162 ఎంజిడి (మిలియన్ గ్యాలన్ పర్ డే) నీరు సరఫరా చేయొచ్చు. వ్యసాయానికి అందివ్వడం, ఆవిరి నష్టాల వల్ల కేవలం 80 ఎంజిడిలు మాత్రమే విశాఖకు చేరుతోంది. పారిశ్రామిక అవసరాలకు పోగా ఈ నీరు లోటు నగర ప్రజల తాగునీటికి కొంతమేర చాలడం లేదన్నది అధికారుల నివేదికలున్నాయి. విశాఖకు కొత్త పరిశ్రమలు రావాలన్నా, ఇతర ఉద్యోగ అవకాశాలు, టౌన్‌షిప్‌లు అభివృద్ధి కావాలన్నా పోలవరమే పరిష్కారం. వర్షాలు కురిస్తే లేదంటే తుపాన్లు వస్తే తప్ప నీటి కొరత సమస్యలను అధిగమించడం కష్టం. విశాఖకు జనాభా వలసలు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వస్తున్నారన్నది తెలిసిందే. పోలవరం ఎడమ కాలువ పూర్తయితే తప్ప విశాఖ నగరానికి తాగునీటి కష్టాలు తీరడం కష్టం. ఈ కాల్వతో విశాఖ జిల్లా తాళ్లపాలెం వరకూ గ్రావిటీ ద్వారా నీరు వస్తుంది. అక్కడ ఒక లిఫ్టు (ఎత్తిపోతలను) ఏర్పాటు చేసుకుంటే ఉత్తరాంధ్ర జిల్లాలోని వ్యవసాయానికి సుమారు 8 లక్షల ఎకరాలకూ నీరు ఇవ్వవచ్చు. పోలవరం పైప్‌లైను, ఎడమ కాలువ రెండింటినీ ప్రభుత్వం నిర్మాణం చేయలేని పక్షంలో వ్యవసాయం సంగతేమోగానీ తాగునీటికి సైతం భవిష్యత్తులో ప్రజలకు కనాకష్టం కానుంది.

కొసమెరుపు?

ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులపై అధికార వైసిపి పెద్దలు కొంతమంది పూర్తిస్థాయిలో ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. అంచనా వ్యయం కూడా భారీగా పెరగడంతో ఉత్తరాంధ్రలో మంత్రులుగా ఉన్న వారే కాంట్రాక్టు తీసుకోడానికి తహతహలాడుతున్నారన్నది స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఎలా రూపొందిస్తుందో చూడాల్సిందే.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎసిపి త్రినాధరావు, అభిమన్యు

గ్రూప్-2 తరగతులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో : అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ప్రారంభం కాబోతున్న ఎపిపిఎస్‌సి గ్రూప్-2 తరగతులను యువత సద్వినియోగం చేసుకోవాలని విశాఖ టాస్క్ ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు పిలుపునిచ్చారు. మంగళవారం తన కార్యాలయంలో శిక్షణా తరగతుల పోస్టర్‌ను స్టడీ సర్కిల్ సమన్వయకర్త కె.అభిమన్యుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్య యువతకు విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో అల్లూరి స్టడీ సర్కిల్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శిక్షణా తరగతుల నిమిత్తం ఆసక్తి గల యువత నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8008412798 ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ రంగం ప్రయివేటీకరణతో దేశానికి నష్టం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు లోకనాథం



దీక్షలో కూర్చున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని, ఈ చర్య దేశానికి తీరని నష్టం అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 656వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో నగర పరిధిలోని వివిధ జోన్లకు చెందిన సిపిఎం నాయకులు కూర్చున్నారు. శిబిరాన్ని లోకనాథం సందర్శించి మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ప్రభుత్వ రంగం వల్ల కేంద్రానికే కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు కూడా ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వ రంగంలో ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. ఈ దీక్షల్లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, వి.కృష్ణారావు, వి.నరేంద్రకుమార్ (ఆరిలోవ), ఎం.సుబ్బారావు, వై.రాజు (జగదాంబ జోన్), డి.అప్పలరాజు (మధురవాడ జోన్), వి.తులసీరామ్ (ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్), జివిఎన్.చలపతి, కె.కుమారి, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

22న రాష్ట్ర స్థాయి శాప్ టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : రాష్ట్ర స్థాయి శాప్ టేబుల్ టెన్నిస్ (ఫేజ్-2) క్రీడా పోటీలు ఈ నెల 22న గుంటూరులోని బిఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు విశాఖపట్నం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య క్రీడా శిక్షకులు ఎస్.సూర్యారావు తెలిపారు. ఈ క్రీడలు అండర్-13, అండర్-17తోపాటు బాలురు, బాలికల సింగల్ విభాగంలో ఉంటాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఎంట్రీ కోసం తమ ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు 9848298333 నెంబర్‌కు వాట్సప్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఒక మనిషికి రూ.300 చొప్పున ఎంట్రీ ఫీజు ఉంటుందని, ఆన్‌లైన్ విధానంలో క్రీడలు జరిగే సమయంలో చెల్లించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు టేబుల్ టెన్నిస్ కోచ్ ఎం.అచ్యుతరావు (8247635751)ను సంప్రదించాలని సూచించారు.

క్వాంట్ ఫండ్ మెరిటార్ క్యు విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పోర్ట్ ఫోలియో మేనేజ్‌మెంట్ కంపెనీ మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వినూత్నమైన క్వాంట్ ఆధారిత ఫండ్ మార్సెల్లస్ మెరిటార క్యును విడుదల చేసింది. ఈ సందర్భంగా బీచ్ రోడ్‌లోని హోటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సౌరభ్ ముఖర్జీ మాట్లాడుతూ, రిటైల్ ఇన్వెస్టర్లకు రిస్క్ సర్దుబాటు చేసిన రాబడులను అందించే రీతిలో దీనిని డిజైన్ చేశామని, మెరిటార్ క్యులో కనీస పెట్టుబడి మొత్తం రూ.10లక్షలుగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రొడక్ట్, డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియోను సృష్టించడం లక్ష్యంగా చేసుకుందని పేర్కొన్నారు. దీనిలో 35-45 స్టాక్స్ భారీ, మధ్య, స్మాల్ క్యాప్ విభాగాలలో ఉంటాయని తెలిపారు. ఈ ఫండును నిఫ్టీ 500 టిఆర్ఎస్ఐకు బెంచిమార్క్ చేశామని చెప్పారు. మెరిటార్ క్యు అతి తక్కువ తగ్గింపులు, అత్యంత వేగవంతమైన రికవరీని ఒడిదుడుకుల మార్కెట్ పరిస్థితులలో సైతం అందించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెరిటార్ క్యు ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్ విఆర్.కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ గడువు పెంచాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ గడువును మరో 10 సంవత్సరాలు పెంచాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జెవి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎల్ఐసి కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సబ్‌ప్లాన్ గడువు ఈ ఏడాది జనవరితో ముగుస్తున్న నేపథ్యంలో వెంటనే పెంపునకు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులను నవరత్న పథకాలకు దారి మళ్లించి ఎస్‌సి, ఎస్‌టిలకు తీరని అన్యాయం చేస్తుందని ఆరోపించారు. తెలంగాణలో మాదిరిగా ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ డెవలప్‌మెంట్ చట్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డు కల్యాణరావు, జి.రాంబాబు, ఎస్.రాజు, గంగాధర్, ముదపాక శ్రీనివాస్, బొడ్డు నాయుడు, పతివాడ రాంబాబు, కాంతారావు, ఎం.శ్రీనివాస్, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన చిన్నారులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సంక్రాంతి సెలవుల్లో బీచ్‌లో రద్దీ కారణంగా సోమవారం నగరానికి వచ్చిన నెల్లూరుకు చెందిన అంగలి కుమారి (6), విజయవాడ కు చెందిన ప్రకాష్ (5) కాళీమాత టెంపుల్ ఎదురుగా ఇసుక సమీపంలో మంగళవారం మధ్యాహ్నం 3:45 గంటలకు తప్పిపోయినట్లుగా కుటుంబ సభ్యులు బీచ్ అవుట్‌పోస్ట్‌లో ఫిర్యాదు చేశారు. విమెన్ కానిస్టేబుల్ -1697, స్విమ్మర్ హరీష్ సహాయంతో తప్పిపోయిన ఇరువురు పిల్లలను పోలీసు మెస్, జాస్తి స్క్వేర్ పాయింట్ మధ్యలో గుర్తించి, సాయంత్రం 4:18 గంటలకు తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. తక్షణమే స్పందించి ఇరువురు పిల్లలనూ తల్లిదండ్రుల చెంతకు చేర్చిన సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ సిహెచ్. శ్రీకాంత్ అభినందించారు.

IN THE HONOURABLECOURT OF THE IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.No. 709 of 2022

Between:
Bugata Narasinga Rao,
S/o. Bugata Narayana,
Resident of D. No, 55-43/16/3.
VYASAKHI NIVAS. Doctors Colony.
Seethammadhara,Visakhapatnam-13.
Mobile No. 8333898989
. . . PLAINTIFF

And:
Smt. Narthu Srilaxmi,
W/o. Harikrishna, Residing at
SK-6/6, Paramount Towers,
Panorama Hills, Yendada,
Visakhapatnam, Mobile No.
8566859999. ... DEFENDANT

NOTICE

My Client Sri Bugata Narasinga Rao S/o. Sri Bugata Narayana. Hindu, aged 41 years. Resident of D.No.55-43/16/3, VYASAKHI NIVAS, Doctors Colony, Seethammadhara Visakhapatnam-530013 has instituted the above Suit against the Defendant for recovery of an amount of Rs. 5,28,603/- (Rupees Five Lakhs Twenty Eight Thousand Six Hundred and Three only) and the matter stands posted to **03.02.2023** for appearance of the Defendant before the Honourable Court by **10.30 AM** either in Person or her Counsel, failing which the Defendant will be made set exparte.

S.NAGESH KUMAR
V(G) VIJAYA
Advocates, Flat No.104,
Ground Floor, Shree Ganesh
Enclave, Dondaparthi,
Near Yerukamamba Temple,
Visakhapatnam -16.
Cell : 9848282374,
8106523333,
9848286374

Visakhapatnam
Dt. 17-01-23

IN THE HONOURABLE COURT OF THE SPECIAL JUDGE FOR TRIAL OF COMMERCIAL DISPUTES AT VISAKHAPATNAM
C.O.S.15/2021 and I.A. 323/2021

Between:
The Board of Trustees, Visakhapatnam Port Trust, rep. by its Chairman ...Plaintiff

And:
Lloyds Shipping Private Limited
. . . Defendant

To: Defendant:
Lloyds Shipping Private Limited, 202-Golden Gate, Pandurangapuram, Visakhapatnam-530 003 Represented by its directors 1) Mr.Kona Prabhakar, S/o. Mr.Kona Chinna Rao, Director, Lloyds Shipping Private Limited, 11-08-22, Parulika, 17-Dasapalla Hills, Visakhapatnam-530 003
2) Mr.Kona Vijayendra, S/o.Mr.Kona Prabhakar, Director, Lloyds Shipping Private Limited, 11-08-22, Parulika, 17-Dasapalla Hills,Visakhapatnam-530 003 And 202-Golden Gate, Pandurangapuram, Visakhapatnam-530 003.

Whereas the above plaintiff has filed the above suit against you for the reliefs mentioned therein. Whereas it is found to the satisfaction of Honourable Court that you have been evading consistently the receipt of summons in the above proceedings. Hence, the Honourable Court was pleased to direct substitute service of summons to you by way of publication in this newspaper.

Take notice that in the above proceedings you are hereby directed to appear before the Special Judge for Trial of Commercial Disputes at Visakhapatnam on **30-01-2023 at 10.30 A.M** either in person or through an advocate failing which the hearing will take place in your absence.

(By order of the Hon'ble Court)
Tatavarthy Law Chambers (TLC)
T.V.S.K. KANAKA RAJU
M.A.S.PRABHA Advocates
Visakhapatnam Ph: 0891-2755164

దావా సమను
ఆర్డర్ 5 రూల్ 1 అండ్ 5 సి.పి.సి.
మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఓ.ఎస్. 540/2021

వెన్నా వెంకటరెడ్డి .... ప్లైంటిఫ్
వర్సెస్
3. దేశిరెడ్డి అనసూయ
4.సంగు రామచంద్రయ్య .... డిఫెండెంట్

2వ డిఫెండెంట్
సంగు రామచంద్రయ్య, తండ్రి: లక్ష్మిరెడ్డి, వయసు: 41 సంll, హిందూ, నివాసం: ఇంటి నెం: 24-83-15/1,సనత్‌నగర్,గాజువాక, విశాఖపట్నం.

పై నెంబరు దావా, వాది స్పెసిఫిక్ ప్రఫార్మెన్స్ ఆఫ్ అగ్రిమెంట్ ఆఫ్ సేల్ డీడ్ 31-05-2021 నిమిత్తం మీ మీద పై నెంబరున దావా దాఖలు చేసియున్నాడు. ఇందు విషయమై మీకు పలుమార్లు దావా సమన్లు పంపగా అవి మీకు ముట్టని కారణముచేత ఈ దినపత్రిక సమను ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా 07-02-2023వ తేదీ ఉదయం 10:30గంటలకు పై కోర్టులో మీరు గానీ, మీ అడ్వకేట్ ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలియజేసుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)

మార్కాపురం **ఇ.శారద**
వాయిదా తేదీ: **07-02-2023** **వై.అనిల్‌కుమార్**
అడ్వకేట్స్ ఫర్ ప్లైంటిఫ్స్
మార్కాపురం,
సెల్: **8985468259.**

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే శంకుస్థాపనలు చేసిన పలు అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారు లను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళ వారం సాయంత్రం స్థానిక క్యాంప్ కార్యాలయంలో జివిఎంసి ఒకటో జోన్ అధికారులతో పలు అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒకటో జోన్ పరిధిలో ఉన్న నాలుగు వార్డుల్లో అభివృద్ధి పనులను వీలున్నంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎఇ ఎ సుమన్, వైసిపి నాయకులు ఎస్ కరుణాకర రెడ్డి, కె ఎల్లాజీ, జివి రమణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వపు విద్యార్థులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం హైస్కూల్‌లో 2003లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం అల్లూరి పార్కులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నివృత్తి చేసుకొని సందడి చేశారు.

ఆకట్టుకున్న నృత్యాలు



ప్రదర్శనలో చిన్నారులు

ప్రజాశక్తి-మాడుగుల:సంక్రాంతి సంబరాలలో భాగంగా మాడుగుల భారత నిర్మాణ సేన అధ్వర్యంలో సోమవారం రాత్రి చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. శ్రీదేవి అధ్వర్యంలో సాంప్రదాయ నృత్య కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ పోటీలలో గెలుపొందిన గాది రాయి, మాడుగుల, ఒమ్మలి టీములు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందగా వీరికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు శ్రీనాదు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, సీతా సతీష్, భారత నిర్మాణ సేన సభ్యులు గౌరీపట్టపు మహేష్, జాగాని ఈశ్వరరావు, కుంచా మధు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సత్తిబాబు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : యువకులు క్రీడల్లో రాణించాలని ఉప్పవరం గ్రామ ఉప సర్పంచ్ కునిశెట్టి సత్తిబాబు అన్నారు. ఉప్పవరం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దురలవాటులకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలలో రాణించిన వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆటల పాటలపై దృష్టి సారించాలన్నారు.

నల్లమారమ్మ తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి-అచ్యుతాపురం :మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో నల్ల మారమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఆలయంలో పసుపు కుంకుమలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా సందర్భంగా ఆలయ ఆవరణలో అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మెజీషియన్ ప్రదర్శన చిన్నారులను ఆకట్టుకుంది. మునగపాక ఎంపిపి మల్ల జయలక్ష్మి, తిమ్మరాజుపేట గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాపు నాయుడు, ఉపసర్పంచ్ భీశెట్టి రాము పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. లంకవానిపాలెం గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ వేచలపు దొరబాబు ఆధ్వర్యంలో గృహ లింగేశ్వర స్వామి తీర్థం, చౌడువాడ గ్రామంలో దండు ముత్యాలమ్మ తీర్థం, గొండుపాలెంలో దండు ముత్యాలమ్మ తీర్థం జరిగాయి. ఉదయం నుంచి ఆయా ఆలయాల వద్ద భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం పలు సాంస్కృతి కార్యక్రమాలు, రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు.

యోగా పోటీలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-చోడవరం :ఈ నెల 27, 28, 29 తేదీల్లో కర్ణాటక రాష్ట్రం బెంగళూరు శివ జ్యోతి యోగ కేంద్ర ఆధ్వర్యంలో యోగా ఉత్సవంలో భాగంగా అన్ని వయసుల వారికి నిర్వహించే యోగా పోటీలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీ స్టేట్ యోగ ఇన్‌ఛార్జి పుల్లేటి సతీష్ తెలిపారు. 8 సంవత్సరాల నుండి 80 ఏళ్ల వరకు వయసుల వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, విజేతలకు అవార్డు అందజేస్తారని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9291276900 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

దళిత ద్రోహి జగన్

- మాజీ మంత్రి కొండ్రు మురళి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దళిత ద్రోహి అని మాజీ మంత్రి, టిడిపి నాయకుడు కొండ్రు మురళి ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దళితుల ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. జిఒ 77 తీసుకొచ్చి దళితులకు అన్యాయం చేస్తున్నారన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని తీసేసారని తెలిపారు. విదేశీ విద్యకు దూరం చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక 11 వేల ఎకరాల ఎస్‌సి భూములు వెనక్కు తీసుకున్నారని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టిల మీద అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. బలహీన వర్గాలకు వైసిపి ప్రభుత్వం ద్రోహం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం వస్తే వైసిపి తొలగించిన 28 పథకాలను తిరిగి అమలు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి మాట్లాడుతూ, ఎస్‌సి నిధులు దారి మళ్లించడంపై జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు.

సమస్యలపై కేబుల్ ఆపరేటర్ల వినతి



మంత్రి అమర్‌ను సత్కరిస్తున్న కేబుల్ ఆపరేటర్లు

ప్రజాశక్తి -తగరపువలస: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేబుల్ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు మంగళవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని బిబివి కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడుఅప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌ను సత్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి కోరాడ వెంకట రమణారావు, తమ్మిన సూర్యప్రకాశరావు, కేబుల్ ఆపరేటర్లు త్రినాధ్, బంగారయ్య, సూరి గోవిందరావు, సత్యారావు, శ్రీరాములు, చంద్ర, చంటి, రాజు పాల్గొన్నారు.

రవితేజకు పార్లె ఉత్సవ్ పురస్కారం



రవితేజను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి- సిరిపురం : హైటెక్ గ్రూప్ ఆధ్వర్యంలో ఒడిశా పర్లాకిమిడిలో నిర్వహించిన పార్లె ఉత్సవ్ -2023లో విశాఖకు చెందిన సినీనటుడు కళాకృష్ణ(రవితేజ)ను సంక్రాంతి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హైటెక్ చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి మాట్లాడుతూ, పర్లాకిమిడిలో పుట్టి, పెరిగిన రవితేజ, తెలుగు, ఒరియా సినీ ఇండస్ట్రీలో మంచి నటుడిగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. పురస్కార గ్రహీత రవితేజ మాట్లాడుతూ, తాను పుట్టిన పర్లాకిమిడిలో తన బంధువులు, అశేషజనవాహిని మధ్య అందుకున్న ఈ పురస్కార సన్మానం ఎంతో ప్రత్యేకమైందన్నారు. ఈ సందర్భంగా అమ్మ మహాలక్ష్మి చిటికిన వేలు పట్టుకుని పర్లాకిమిడి వీధుల్లో తిరిగిన రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చారు. మళ్లీ జన్మ ఉంటే కళాకారుడిగానే పుట్టాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సినీనటులు గౌతంరాజు, చిత్రం శ్రీను పాల్గొన్నారు. జబర్దస్త్ అదుర్స్ ఆనంద్' బృందం స్కిట్, ఆటపాటలతో అలరించింది.

దుర్గాలమ్మను దర్శించుకున్న సిఐ సాయి

ప్రజాశక్తి - పిఎం పాలెం : మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మను పిఎం.పాలెం ట్రాఫిక్ సిఐగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన నల్లిసాయి, ఎస్ఐ మురళీకృష్ణ మంగళవారం దర్శించుకున్నారు. వీరిని ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, పట్నాల రాంబాబుశర్మ, శంకర్ స్వామి వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వీరిని ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, ఇతర కమిటీ సభ్యులు దుశ్శాలువలతో సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి నాగోతి తాతారావు, పిళ్లా అప్పన్న, పోతిన రాంబాబు పాల్గొన్నారు.

చిన తీనార్లలో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినతీనార్ల గ్రామంలో గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యాధికారి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గత రెండు రోజుల నుండి గ్రామంలో పలువురు వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. .ఈ మేరకు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించి మందులను అందజేశారు. వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న పలువురిని నక్కపల్లి సిహెచ్‌సికి తరలించి వైద్యం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ కుమార్ వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహారం తీసుకోవాలని రోగులకు సూచించారు. పండుగ సందర్భంగా నాన్ వెజ్ తినడంతోనే పలువురు వాంతులు, విరోచనాలు బారిన పడినట్టు భావిస్తున్నట్లు తెలిపారు.గ్రామంలో శానిటేషన్ చర్యలు చేపట్టారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-వడ్డాది : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా ఈ నెల 18న బుధవారం ఉదయం చోడవరం టిడిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యాబాబు తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టిడిపి నేతలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలివచ్చి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు తులసీరావు సంతాప సభ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు సంతాప సభ, పెద్ద కర్మ ఈనెల 18వ తేదీ బుధవారం ఉదయం ఎలమంచిలిలోని ఆయన స్వగృహంలో నిర్వహిస్తున్నట్లు డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తెలిపారు. సంతాప సభకు వేలాదిగా తరలివచ్చే వారందరికీ అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పాల సంఘాల అధ్యక్షులు, సిబ్బంది, డైరెక్టర్లు, పాడి రైతులు, అభిమానులు సంతాప సభకు హాజరు కావాలని ఆయన కోరారు

ట్రిపుల్ ఐటి విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న గంధవరం ఉద్యోగులు, యువత

ప్రజాశక్తి -పద్మనాభం: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో సీటు సంపాదించినా, ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కొత్తల సోనియా అనే నిరుపేద విద్యార్థికి మండలంలోని గంధవరం గ్రామానికి చెందిన యువత, ఉద్యోగులు రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని అందించి తమ ఉదారతను చాటుకున్నారు. విద్యార్థిని సోనియా బాగా చదివి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.

తెప్పోత్సవ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 21న బహుళ పుష్య అమావాస్య రోజున నిర్వహించనున్న అత్యంత ప్రతిష్టాత్మక వేడుక తెప్పోత్సవ ఏర్పాట్లను సింహాచల దేవస్థానం ట్రస్టీ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుష్కరిణి చెరువు మెట్ల మార్గంలో ఉన్న నాచును తొలగించాలని దేవస్థానం అధికారులకు సూచించారు. ఉత్సవ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయని, స్వామి ఆశీస్సులతోఈ వేడుక జయప్రదమౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సిఆర్‌పిఎఫ్ దక్షిణ భారత రాష్ట్రాల కన్వీనర్‌గా సీతారాం



గొండు సీతారాం

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆల్ ఇండియా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఎఐసిఆర్‌పిఎఫ్) సౌత్‌జోన్ రాష్ట్రాల కన్వీనర్‌గా ఎపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. మంగళవారం వర్చ్యువల్ విధానంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఎన్నికలో జాతీయ ఫోరంలో ప్రాతినిధ్యం వహిస్తున్న 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫోరం రాష్ట్ర, జాతీయ కన్వీనర్లు ఈ మేకు సీతారాంను ఎన్నుకున్నారు. ఫోరం జాతీయ సలహాదారు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ శాంతా సిన్హా, మాజీ ఐపిఎస్.అధికారి వివి.లక్ష్మీనారాయణ, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అశోక్ అగర్వాల్, అంతర్జాతీయ బాలల హక్కుల పరిరక్షకులు ఆర్.వెంకటరెడ్డి, డి.ప్రకాష్ సారథ్యంలో ఎన్నిక అనంతరం, సీతారాంకు నియామకపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ, జాతీయఫోరమ్‌కు ఎన్నిక కావడం ప్రమోషన్ ఇచ్చినట్టేనని, ఇదే స్ఫూర్తితో సేవలు అందిస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఉన్నది కూల్చేశారు.. కొత్తది నిర్మించరు.. దోబీఘాట్ లేక రజకుల అవస్థలు



దోబీఖానా నిర్మాణానికి ప్రతిపాదిత స్థలం ఇదే

- బట్టలు ఉతికి, ఆరబెట్టుకునేందుకు నిత్యం అగచాట్లు
- ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చని హామీలు
- ఆవేదన చెందుతున్న రజ'కుల' వృత్తిదారులు

ప్రజాశక్తి -తగరపువలస: అరకొర సౌకర్యాలున్నాయని ఉన్న దోబీఖానాను కూల్చేశారు. సకల సౌకర్యాలతో గోస్తనీ నది ఒడ్డున కొత్తది నిర్మిస్తామన్న హామీ ఏళ్లు గడుస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో రెంటికి చెడిన రేవడిలా జివిఎంసి, ఒకటో వార్డులోని దాదాపు 300 కుటుంబాల రజక వృత్తిదారులు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. బట్టలు ఉతికి, ఆరబెట్టుకునేందుకు గోస్తనీ నది వద్ద వీరు పడే అవస్థలు అంతాఇంతా కాదు. ఇప్పటికైనా నేతలు, అధికారులు స్పందించి, దోబీఘాట్‌ను నిర్మించాలని వేడుకుంటున్నారు.

ఆర్‌టిసి బస్‌కాంప్లెక్స్ పేరుతో దోబీఖానా తొలగింపు..

తగరపువలసలో ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్, డిపో నిర్మాణం కోసమని ఒకటోవార్డులోని దోబీఖానాను తొలగించారు. దీనికోసం 2004-05లో నిర్మించిన దోబీఖానాలో పూర్తి సౌకర్యాలు లేవని, రజకుల వృత్తిపనికి అవసరమైన అన్ని సౌకర్యాలతో దోబీఘాట్‌ను నిర్మిస్తామని హామీనిచ్చారు. 2016 జూన్ 12న, అప్పటిమంత్రి గంటా శ్రీనివాసరావు ఆర్‌టిసి డిపో నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. అయితే అటు ఆర్‌టిసి డిపో నిర్మాణాన్ని నేటికీ ప్రారంభించలేదు సరికదా.., ఇటు ఉన్న దోబీఘాట్‌ను కూల్చేసి, రెండూ లేకుండా చేశారని రజక వృత్తిదారుల తోపాటు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రత్యామ్నాయ స్థలంలో దోబీఘాట్ నిర్మాణం చేపట్టాలని ఎప్పటినుంచో కోరుతున్నా, నేటికీ కార్య రూపం దాల్చలేదు.

హామీని అటకెక్కించారు...

రజకుల విజ్ఞప్తి మేరకు శివాలయం ఎదురుగా గోస్థనీ ఒడ్డున సుమారు 92 సెంట్ల ప్రభుత్వ స్థలంలో పూర్తిస్థాయి సౌకర్యాలతో దోబీఖానా నిర్మించాలని రజకులు కోరుతున్నారు. దీనిపై గత, ప్రస్తుత ప్రభుత్వాలు, పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలనిపలుదఫాలుగా మొరపెట్టుకున్నా, అధికారులు, నేతల నుంచి కనీస స్పందన లేదని అంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



సంప్రదాయ రజక వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. వేరే పని చేత కాదు. ప్రభుత్వం తమను అన్ని విధాలా ఆదుకోవాలి. దోబీఖాణా హామీ అమలు చేయాలి.

కళింగపట్నం రామారావు
రజక సంఘం ప్రతినిధి

ఇచ్చిన హామీ నెరవేర్చాలి



ఒకటో వార్డులో సుమారు 300 కుటుంబాలు రజకవృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. అన్ని మౌలిక వసతులతో దోబీఖానా నిర్మిస్తామనన హామీని నెరవేర్చాలి.

కళింగపట్నం కొండబాబు,
అధ్యక్షులు
అల్లూరి సీతారామరాజు రజక సంఘం

సిఎం జగన్‌కు పెళ్లి ఆహ్వానం



సిఎం జగన్‌కు పెళ్లి శుభలేఖను అందజేస్తున్న డాక్టర్ దంపతులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : పైడి వారి పెండ్లి పిలుపులో భాగంగా డాక్టర్ సాకేత్, డాక్టర్ శ్రావికా రెడ్డి పెండ్లిశుభలేఖను తాడేపల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి, డాక్టర్ పైడి కళావతి దంపతులు అందజేశారు.

భీమిలి బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : సాగర తీర స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా చిప్పాడ దివీస్ ఆధ్వర్యంలో స్థానిక బీచ్‌లో పది రోజులుగా సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను మంగళవారం క్లాప్ వాహనాలకు అందజేశారు. పదిరోజుల్లో ప్లాస్టిక్ 52 కిలోలు, ఇతర వ్యర్థాలు 95 కిలోలు, గాజు 15 కిలోలు సేకరించినట్లు దివీస్ ప్రతినిధులు తెలిపారు.జివిఎంసి పారిశుధ్య కార్మికులు, దివీస్ సిఎస్ఆర్ ప్రతినిధులు నాగరాజు, శేఖర్ బాబు పాల్గొన్నారు.



వ్యర్థాలను అందజేస్తున్న దివీస్ ప్రతినిధులు

శిల్పారామంలో అలరించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు



నృత్యప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : సంక్రాంతి సంబరాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో మంగళవారం సాయంత్రం కుషాల్ డాన్స్ అకాడమీ వారిచే శాస్త్రీయ, జానపద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి కౌస్తుభం, జ్యోతి స్వరం, దశావతార శబ్ధం, ముద్దుగారే యశోద, బ్రహ్మమొక్కటే, రామ శబ్దం, నడవరో గరుణగమన, దేవ దేవం భజే, చందమామలా ఉన్న, వల్లారి మావో, లాలాగూడా లంబాడీ పిల్లా, తమిళ ఫోక్, నల్ల చీర నల్ల రైక, కోయిలారే, గాజుల చప్పుడు అంశాలను తదితర విభిన్న నృత్యాలను ప్రదర్శించారు. దుర్గ భవాని, గీతాంజలి, యశస్విని, సారిక, రోషిణి, సీత, కారుణ్య, రఘు తదితర కళాకారులు నృత్యాలతో సందర్శకులను కనువిందు చేశారని శిల్పారామం పరిపాలనాధికారి టి. విశ్వనాథరెడ్డి తెలిపారు. శిల్పారామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గతకొద్దిరోజులుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, ప్రతిరోజూ అధికసంఖ్యలో సందర్శకులు తరలివచ్చి, పలువురు కళాకారులు ప్రదర్శించిన విభిన్న నృత్యరీతులను తిలకించి, వారిని ఉత్సాహపరచడం ఎంతో ఆనందంగా ఉందని విశ్వనాథరెడ్డి తెలిపారు.

మంత్రి అమర్ దృష్టికి ఆర్‌ఎంపిల సమస్యలు



మంత్రి అమర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ఆర్‌ఎంపిల ప్రతినిధులు

ప్రజాశక్తి-ఆనందపురం: గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పష్టమైన హామీనిచ్చారని ఆర్‌ఎంపి ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారులు డాక్టర్ ఎన్ఎల్. రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్. జంగం జోషి తెలిపారు. మంత్రి అమర్‌ను ఆయన స్వగృహంలో కలిసి, నాలుగు దశాబ్ధాలుగా తమ సమస్యలను, గత ప్రభుత్వాల నిర్ణయాలు, జిఒ 429 గురించి వివరించారు. దీనిపై మంత్రి స్పందించి, ఆర్‌ఎంపిల సమస్యలను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎన్ వినేశ్వరి, జోనల్ సహాయ కార్యదర్శి పచ్చిపులుసు కనకారావు ఉన్నారు.

హామీలను తక్షణమే అమలు చేయాలి

- దేశవ్యాప్తంగా 26న రైతు రక్షణ ఉద్యమం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి -అనకాపల్లి

ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం దొగిచ్చి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామనాయుడు కార్మిక కర్షక నిలయంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రైతు చట్టాలను వ్యతిరేకిస్తూ ఏడాది పాటు ఢిలీలో రైతాంగం సాగించిన ఉద్యమానికి కేంద్రం మెడలు వంచక తప్పలేదని పేర్కొన్నారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఆ చట్టాలను రద్దు చేయడంతో పాటు, పంటల గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కల్పిస్తామని, రైతు సంఘాలతో చర్చించకుండా విద్యుత్తు సంస్కరణల బిల్లు పార్లమెంటులో పెట్టబోమని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాని ఆ హామీలు నేటికీ నెరవేరలేదని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని కారణంగా ఏఐకేఎస్ పిలుపుమేరకు ఈనెల 26న రైతు రక్షణ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు ఎత్తివేత, పేద రైతులకు వ్యవసాయ రాయితీలు ఎత్తివేత, విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు అప్రాజస్వామికంగా పార్లమెంటులో కేంద్రం బిల్లు పెట్టడం దారుణమన్నారు. దీనిపై గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి రెండో దశ పోరాటానికి సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. రైతాంగ కోర్కెలపై సంతకాల సేకరణ, కరపత్ర ప్రచారం, ఆటోల ద్వారా ప్రచారం, ప్లకార్డుల ప్రదర్శన, నెహ్రూ చౌక్ సెంటర్లో పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం అప్పలరాజు, రైతు నాయకులు వైఎస్ భద్రం, కోరిబిల్లి శంకర్రావు, అఖిలభారత గ్రామీణ కార్మిక సంఘం నాయకులు పిఎస్ అజయ్ కుమార్, చేతి వృత్తి సంఘాల నాయకులు గంట శ్రీరామ్, కిసాన్ కాంగ్రెస్ నాయకులు కాళ్ళ ఏడుకొండలు, సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు, పెంటకోట శ్రీనివాసరావు, రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు బి ఉమామహేశ్వరరావు, ఎం నాగేశ్వరరావు, ఎన్‌పిఆర్‌డి నాయకులు. బి నూక అప్పారావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో సుదేవ్‌కు కాంస్యం

ప్రజాశక్తి-కె.కోటపాడు



పతకాలు చూపుతున్న సుదేవ్

మండలంలో ఎ.కోడూరు మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు కుటుంబానికి చెందిన లెక్కల సాత్విక్ సుదేవ్ (3వ తరగతి) జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో కాంస్య పతకాలు సాధించాడు. సాత్విక్ సుదేవ్ గతేడాది నవంబరు 30న ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్, వోల్గా ఆర్చరీ అకాడమీ సంయుక్తంగా విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ (అండర్-9) రికర్వ్ విభాగంలో ఉమ్మడి విశాఖ జిల్లా నుండి పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ నెల 13, 14, 15 తేదీలలో విజయవాడలోని వెలగపూడి రామకృష్ణ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఎన్‌టిపిసి, ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, వోల్గా అర్చరీ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన జాతీయస్థాయిలో ఆర్చరీ (అండర్-9) రికర్వ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ టీం తరపున పాల్గొని తమిళనాడు బాయ్స్ టీంపై గెలిచి కాంస్యం పతకం సాధించాడు. ఇవే పోటీలలో మిక్స్‌డ్ (బాలురు, బాలికలు) విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ టీంతో తలపడి రజిత పతకం సాధించాడు. సుదేవ్ ఐదేళ్ల వయస్సు నుండి శిక్షణ పొందుతున్నాడు. ఆరేళ్ల వయసులోనే మొదటిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో మూడవ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొన్నాడు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి -మునగపాక రూరల్

సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని తోటాడ గ్రామంలో సోమవారం రాత్రి నెహ్రూ యూత్ క్లబ్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చందు మ్యూజికల్ క్రియేషన్స్ పొలమరశెట్టి చంద్రరావు బృందం వారు ఆలపించిన సినీ, జానపద గీతాలు పలువురిని అలరించాయి. రేయనక, పగలనక సేద్యం చేసి ఎందరికో పొట్టలు నింపుతున్న రైతన్నల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్వార్థంతో పంటలు లేక బీడు భూములుగా మారిపోయిన వైనాన్ని, కోట్లాది రూపాయలు సంపాదించాలనే ఆశతో విషాన్ని చిమ్మే ఫ్యాక్టరీలను నెలకొల్పడం కోసం పచ్చని పంట పొలాలను కారు చౌకగా రైతుల నుండి లాక్కొని అన్నదాతలు బలవన్మరణాలు పొందే పరిస్థితులను అద్దం పట్టే విధంగా మునగపాకకు చెందిన శ్రీలక్ష్మి కళా యూనియన్ వారు ప్రదర్శించిన "రైతంటే" నాటిక ప్రేక్షకులను రంజింపజేసింది.



రైతంటే నాటికలోని ఓ సన్నివేశం

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - కె.కోటపాడు

కనుమ పండగ సందర్భంగా మండలంలోని ఆర్‌వై అగ్రహారం గ్రామ రామాలయం ప్రాంగణంలో శ్రీరామ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ముగ్గులు, ఉట్టుకొట్టుట పోటీలు నిర్వహించారు. అత్యధిక మంది యువకులు ఉట్టు కొట్టారు. ముగ్గుల పోటీల్లో 18 మంది మహిళలు పాల్గొనగా, వారు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. మొదటి బహుమతి తామరపల్లి శ్రావణి, రెండవ బహుమతి బండారు సుహాసిని, మూడవ బహుమతి వై నాగమణి, నాలుగో బహుమతి రెడ్డి భవ్య శ్రీ గెలుచుకున్నారు. వీరితో పాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ న్యాయ నిర్ణేతలు యడ్ల అప్పారావు మాస్టారు, బోని అప్పలనాయుడు, పిఈటి యడ్ల రామకృష్ణ, నాగిరెడ్డి గొంగలయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కన్నూరు లక్ష్మీ నాగభూషణం, ఎంపీటీసీ యడ్ల పైడిం నాయుడు, మండ శ్రీనివాసరావు, బోని సత్యనారాయణ మూర్తి, మండ మల్లికార్జునరావు, యడ్ల పోతిబాబు, గవిరెడ్డి ముత్యాల నాయుడు, యాళ్ల శ్రీను, శ్రీరామ యువజన సేవా సంఘ అధ్యక్షులు యడ్ల నరేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఒక దగ్గర కలుసుకున్న లాలం కోడూరు హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలోని లాలం కోడూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 2003 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఆత్మీయంగా కలిశారు. 122 మంది పూర్వ విద్యార్థులు లాలం కోడూరు హైస్కూల్లో కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 20 ఏళ్ల తరువాత కలిసిన వీరంతా ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామానికి చెందిన కాశిరెడ్డి లక్ష్మణరావు మాట్లాడుతూ తాను ఇక్కడి ఉపాధ్యాయుల సహకారంతో చదువుకొని ఎస్ఐగా ఉద్యోగాన్ని సాధించినట్లు చెప్పారు. లక్ష్మణరావు ఎస్ఐ కావడంపై తోటి మిత్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఎవరైనా ఆపదల్లో ఉన్నా, కష్టాల్లో ఉన్న అందరమూ సహాయం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. దీనికి ఒక సంఘం పెట్టి దాని ద్వారా సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు.

అచ్చుతాపురం : మండలంలోని ఎం జగన్నాథపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2008-09 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. వీరంతా ఒకరినొకరు ఆలింగం చేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. 'ఏరా ఏం చేస్తున్నావ్?' 'ఏమిటి విశేషాలు' అనే పదాలతో ఉచ్చరించుకున్నారు. పిల్లలు బాగున్నారా ఎంత చదువుతున్నారు అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి బి.శ్రీను, గణేష్, ప్రగడ శీను, నాగ జగదీష్, రాజ నాయుడు, ఆనంద్, బి.రాజు, వెంకట అప్పారావు తదితరులు ఆర్గనైజర్లగా వ్యవహరించారు.




ఎం.జగన్నాథపురం జెడ్‌పి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- అనకాపల్లి

శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం సభ్యులు, ప్రముఖ వ్యాపారవేత్త, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నుదురుపాటి వెంకట అప్పల నరసింహం (తాతాజీ) తన జన్మదినాన్ని పురస్కరించుకొని తన సతీమణి రాధికతో కలిసి మంగళవారం పేదలకు బట్టలు, నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. చిన్న వీధిలోని ఆయన స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా తనది ఎన్నో పుట్టినరోజు అయితే అంతమందికి బట్టలు, నిత్యవసర వస్తువులను పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కే శివ నారాయణ, తాటికొండ శ్రీను, కెవి సత్యనారాయణ, కే కోటేశ్వరరావు, కే లక్ష్మణరావు, డి గణేష్, కే సాయికిరణ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



బట్టలు, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎఎస్‌పి విజయభాస్కర్

పోలీసు ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 22న జరిగే పోలీసు ప్రిలిమినరీ పరీక్షలకు సంబంధించిన కేంద్రాలను మంగళవారం ఎస్పీ గౌతమి శాలి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ బి విజయభాస్కర్ పరిశీలించారు. ఇందులో భాగంగా స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్‌తో పాటు పలు కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షా కేంద్రాలకు కావలసిన బందోబస్తు గురించి డీఎస్పీ బి సునీల్‌తో చర్చించారు.

అచ్యుతాపురం : స్థానిక కైట్స్, ప్రశాంతి కళాశాలల్లో ఈ నెల 22న నిర్వహించే పోలీస్ పరీక్షా కేంద్రాలను మంగళవారం జిల్లా అదనపు ఎస్పీ బి విజయ్ కుమార్ పరిశీలించారు. ఆయన వెంట డిఎస్పి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

జగన్ హామీలు మాటలకే పరిమితం

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమయ్యాయని, ఆచరణలో అమలు చేయలేదని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల హామీలను 98 శాతం అమలు చేసినట్టు, ప్రధానంగా రైతుల ప్రత్యామ్నాయ పంటలకు ప్రభుత్వం చేయూత అందిస్తుందని చెప్పడం వట్టిమాటలేనని, ఎన్నికల మేనిఫెస్టోను పరిశీలిస్తే ఈ విషయం అర్థం అవుతుందని పేర్కొన్నారు. రైతు భరోసా కింద ప్రతి రైతుకు రూ.12,500 ఏడాదికి ఇస్తామని చెప్పి, కేవలం రూ.7,500 మాత్రమే చెల్లిస్తున్నట్లు చెప్పారు. 65 మంది లక్షల రైతులను 45 లక్షలకు వివిధ అంశాల పేరుతో కుదించడం జరిగిందన్నారు. పాడి రైతులకు నాలుగు రూపాయల రాయితీ కల్పన, వడ్డీ లేని రుణాలు గాలిమాటలేనన్నారు. బిందు సేద్యానికి రాయితీ ఎత్తివేశారని, జలకల బోర్లు ప్రచారానికే పరిమితం అయిందని పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు మీటర్లు బిగించి రైతు మెడకు ఉరితాలు బిగించారన్నారు. ధరల స్థిరీకరణ కోసం మూడు వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తామని చెప్పి ఒక రూపాయి కూడా బడ్జెట్లో కేటాయించలేదని తెలిపారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో హామీలను జగన్ రెడ్డి గాలిలో కలిపారని విమర్శించారు.

డ్రెయినేజీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని తుమ్మపాలలో డ్రైనేజీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు తెలిపారు. గ్రామంలోని గవరపేట కొణతాల దిబ్బ డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం సర్పంచ్ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పిడి గాంధీ, ఎంపీటీసీ సభ్యులు పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వార్డు మెంబర్లతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఇందుకు కావలసిన బడ్జెట్ ఎస్టిమేషన్ వేసి మంత్రి అమర్నాథ్, ఎంపీ సత్యవతి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ సహకారంతో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు తర్ర సత్యారావు, వెలగా మోది నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌కు సమస్యలు తెలియజేస్తున్న స్థానికులు

పేదల గుడిసెలు తొలగించడం అన్యాయం

- బాధితురాలు ఆత్మహత్యాయత్నం విషయమై దేవాదాయశాఖ అధికారులపై కేసు నమోదు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి

స్థానిక టీటీడీ కల్యాణ మండపం ప్రహరీకి ఆనుకొని ఉన్న స్థలంలో 40 ఏళ్లగా నివాసముంటున్న పేదలు గుడిసెలను తొలగించడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దేవాదాయ శాఖ అధికారులు సంక్రాంతి పండగకు రెండు రోజుల ముందు శుక్రవారం రాత్రి సమయంలో పాకలు తొలగించడం దుర్మార్గమన్నారు. ఏళ్ల తరబడి నివాసముంటున్న పేదల గుడిసెలు తొలగింపునకు పూనుకోవడంతో మనస్తాపానికి గురైన బాధితురాలు బొబ్బరి నాగమణి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె విశాఖ కెజిహెచ్‌లో ప్రాణాపాయ స్థితిలో వైద్య సేవలు పొందుతుందన్నారు. దీనికి దేవాదాశాఖ అధికారులను బాధ్యులను చేసి వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఈ పాకలు తొలగింపు వెనుక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల ఉన్నట్లు అర్థమౌతుందని పేర్కొన్నారు. అధికారం ఉంటే ఏదైనా చేయొచ్చు అనడానికి ఇదే నిదర్శనమన్నారు. దేవరాపల్లికి చెందిన బొబ్బరి కనకమ్మ, బొబ్బరి నాగమణి సుమారు 40 ఏళ్ల పైబడి ఇక్కడ పాకలు వేసుకొని నివాసముంటున్నారని, వీరికి విద్యుత్ మీటర్లు ఉన్నాయని, బిల్లులు చెల్తిస్తున్నారని తెలిపారు. అయినా వీరికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే జెసిబితో వీరి పూరిళ్లను, కరెంటు మీటర్లు తొలగించారని పేర్కొన్నారు. దేవరాపల్లి మండలంలోని మారేపల్లి రెవెన్యూలో దాదాపుగా 30 ఎకరాలు దేవుని మాన్యం భూమిలో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతున్నా కనీసం పట్టించుకోని దేవాదాయశాఖ అధికారులు పేదలు గుడిసెలను అర్ధాంతరంగా తొలగించడం దుర్మార్గమన్నారు. ఈ గుడిసెలు ఉన్న స్థలం రోడ్డుకు అనుకొని ఉండటం, దీని విలువ కోట్ల రూపాయల్లో ఉండడంతో దీనిని అధికార పార్టీ నాయకులకు కట్టబెట్టడం కోసం ఇటువంటి ఘాతుకానికి పూనుకున్నారని వెంకన్న మండిపడ్డారు. అధికార పార్టీ అగడాలు ఇక ఎన్నో రోజులు సాగవని, ప్రజలు గనపాఠం చెప్పే సమయం దగ్గర పడిందని హెచ్చరించారు. వెంటనే అక్రమంగా తొలగింపునకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.



విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితరాలు నాగమణి

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను

ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి- కె.కోటపాడు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని కోరుతూ మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో మంగళవారం మల్లికార్జున తీర్థం సందర్భంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, స్టీల్ ప్లాంట్ ఉద్యోగి రొంగలి వెంకట్రావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి నాటి కేంద్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు ఇవ్వడం, ఈ కాలంలో స్టీల్‌ప్లాంట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.59 వేల కోట్ల రూపాయలు డివిడెంట్ రూపంలో చెల్లించిందని తెలిపారు. విశాఖస్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వలేదని, అవి ఉంటే మరింతగా లాభాలు వచ్చేవని పేర్కొన్నారు. ప్రైవేటు స్టీల్ పరిశ్రమలకు ఇనుప ఖనిజాలు ఇస్తున్న కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ప్రతి ఏటా2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దని 700 రోజుల పైబడి ఆందోళన చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకొనేందుకు కార్మికులు, రైతులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు అప్పారావు, రాయవరపు సింహాచలం, వనము సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎన్ఎఒబి నిర్వాసితులు

79వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఒబి నిర్వాసితులు మండలంలోని వాడనర్సాపురం వద్ద నేవీ గేట్ ఎదురుగా చేస్తున్న ఆందోళన మంగళవారం నాటికి 79వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ 79 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. శారద, వరాహ నదులు గుండా వేటకు వెళ్లనీయకపోవడంతో ఉపాధి కోల్పోయామని తెలిపారు. ఆధార్ కార్డు ఆధారంగా వేటకు వెళ్లడానికి అవకాశం కల్పించాలని లేదంటే జెట్టీని తక్షణమే నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది గ్రామాల నిర్వాసితులు, జెఎసి నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఎపి సేవా ట్రస్టు వైస్ చైర్మన్‌గా మీసాల

ప్రజాశక్తి-వడ్డాది

జగనన్న సేవా ట్రస్టు వైస్ చైర్మన్‌గా బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట గ్రామానికి చెందిన యువకుడు మీసాల మోహన్ రావు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు జేఎన్ ఆంధ్రయ్య ఉత్తర్వులు జారీ చేశారు. మీసాల మోహన్‌రావు ఇప్పటివరకు ఏపీ స్టేట్ సెక్రటరీగా ఉండగా, ఉపాధ్యక్షుడిగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందేలా చూడడమే తన ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. వైస్ చైర్మన్‌గా నియమితులైన మోహన్‌రావును జెడ్పిటిసి దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలిత నారాయణమూర్తి, కొలిమెల అచ్చం నాయుడు, కో-ఆపరేటివ్ అధ్యక్షులు సాయం రమేష్, సర్పంచ్ మెరుగు కుమారి బాబురావు అభినందించారు.



మీసాల మోహన్‌రావును అభినందిస్తున్న దృశ్యం

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-చోడవరం

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం సచివాలయం-3 పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వం నుండి లబ్ధిదారులు పొందిన సహాయాన్ని ఆయన స్థానిక మహిళలకు వివరించారు. ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వారికి వెంటనే మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. అర్హత ఉండి పింఛన్లు రాలేదని కొంతమంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అర్హులైన వారందరికీ పింఛన్ల కోసం అప్లోడ్ చేయాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరి కుమారి, తహశీల్దారు తిరుమల బాబు, పంచాయతీరాజ్ డిఇ ప్రసాద్, వైసిపి నాయకులు బి సూర్యనారాయణ, తినబోయిన అప్పారావు యాదవ్, దేవరాపల్లి సత్య, గుమ్మడి శ్రీను, సేనాపతి శ్రీనివాసరావు, ఒరుగంటి నెహ్రూ, పుల్లేటి వెంకటేష్, సేనాపతి సత్యారావు, నాయకులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

కనీస సదుపాయాలు కల్పించాలని.. ఆదివాసీల ఆందోళన

ప్రజాశక్తి -కొత్తకోట

తమ గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ రావికమతం మండలం చీమలపాడు శివారు జీలుగులోవ గ్రామ ఆదివాసీలు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొర్ర గసన్న, కొర్ర బాలరాజు తదితరులు మాట్లాడుతూ, జెడ్ జోగంపేట గ్రామానికి సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో సామలమ్మ కొండపై గత కొన్నేళ్లుగా సుమారు పది కుటుంబాలు జీవనం సాగిస్తున్నా మని, 50 మంది జనాభా కలిగిన తమకు నేటికీ కనీసం తాగునీరు, రహదారి, విద్యుత్ సౌకర్యం లేదన్నారు. జనాభాలో 16 మంది వరకూ చదువు కునే చిన్నారులు ఉన్నారని, వీరు విద్యకు నోచు కునేందుకు అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల వంటి సదుపాయాలు లేవని వాపోయారు. మూడు కిలో మీటర్ల దూరంలో జెడ్. జోగంపేట ప్రభుత్వ పాఠశాలకు అటవీ మార్గం లోనే రాక పోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. గ్రామంలో ఎవ్వరికి అనారోగ్యం కలిగినా వైద్య సేవలు అందలేదని, గత నెలలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ సీదిరి వెంకటరావు మార్గ మధ్యలో మృతి చెందాడని, ఈ సమస్యలపై గత ఆరు నెలల కిందట మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా గ్రామాన్ని సందర్శించి మౌళిక సదుపాయల కల్పనకు చొరవ చూపాలని ఆదేశాలు జారీ చేయగా ముగ్గురు ఆర్‌డివో స్థాయి అధికారులతో పాటు ట్రైబుల్ వెల్ఫేర్ అధికారులు గ్రామానికి వచ్చారని తెలిపారు. వచ్చిన ప్రతి అధికారి గ్రామాన్ని సందర్శించి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడమే గాని అందుకు కృషి చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఆదివాసీ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి మౌళిక సదుపాయల కల్పనకు చర్యలు చేపట్టాలని ఐదవ షెడ్యూల్ సాధన కమిటి జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు, ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సూరిబాబు, గిరిజనులు తదితరులు డిమాండ్ చేశారు.



నినాదాలు చేస్తున ఆదివాసీలు



ధ్రువీకరణ పత్రాన్ని ఇస్తున్న సబ్ రిజిస్టర్, ఎంపీటీసీ

ఆన్‌లైన్‌లో వివాహాల రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-కోటవురట్ల:వివాహాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే వాటిని పరిశీలించి రిజిస్ట్రేషన్ నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని స్థానిక సబ్‌రిజిస్ట్రార్ నరసింహమూర్తి తెలిపారు. బికేపల్లి గ్రామానికి చెందిన పసకడుగుల లచ్చారావు, రాజమండ్రి గ్రామానికి చెందిన అరుణ కుమారి దంపతులకు సబ్ రిజిస్టర్ వివాహ ధ్రువీకరణ పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు వివాహాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బికెపల్లి ఎంపీటీసీ సభ్యులు పెట్ల రాంబాబు పాల్గొన్నారు.



వరి నూర్పులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి- నక్కపల్లి:రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బికె)లో ధాన్యం కొనుగోలు గడువు వచ్చే నెల 15తో ముగుస్తుందని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించే రైతులు వరి కుప్పలను త్వరితగతిన నూర్చి ప్రభుత్వం అందించే కనీస మద్దతు ధర సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఎంటియు 1064, 1061 రకాలు వేసిన రైతులు తప్పకుండా ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలకు విక్రయించాలని కోరారు. పలు గ్రామాల్లో వరి నూర్పులను పరిశీలించి ,రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికే సిబ్బంది పాల్గొన్నారు.



వెండి ఆభరణాలు అందిస్తున్న భక్తులు

వెండి ఆభరణాలు వితరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన దేవాలయంలో అమ్మవారికి పద్మనాభుని కన్నయ్య శెట్టి శాంతి దంపతులు, శ్రీరామ ఐరన్ షాప్ వ్యాపారి పెద్దబాబులు ఆలయ చైర్మన్ దేవత కామేశ్వరరావు సమక్షంలో సమర్పించారు. ఊక నాగేశ్వరరావు వెండి ముంజేటి కడియం అమ్మవారికి సమర్పించారు.స్థానిక ఐదు రోడ్ల జంక్షన్ వద్ద గల బాల వినాయక దేవస్థానంకు కొత్తూరు మీనాక్షి దంపతులు వెండి దండను అందజేశారు.

పొంచివున్న ప్రమాదం

-ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

-ఆందోళనలో గృహ యజమానులు

ప్రజాశక్తి- రావికమతం:ఇంటిపై వేలాడుతున్న కరెంటు తీగలను తొలగించాలని విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంపై తట్టబంద సర్పంచు గోకివాడ రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకు వచ్చి ప్రజలకు అందుబాటులో సేవలు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తుంటే విద్యుత్‌శాఖ అధికారులు ఆ దిశగా ఉండలేదన్నారు గ్రామ సమస్యలను అధికారులకు దృష్టికి తీసుకువెళ్లినా స్పందన కరువైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్, గ్రామస్తుల కథనం మేరకు...తట్టబంద పంచాయతీ సాయినగర్‌లో శరందాసు పరదేశి నాయుడు ఇంటి వద్ద నుంచి సిరసపల్లి అప్పారావు ఇంటి వద్ద వరకు సుమారు 20 గృహాల పై నుంచి కరెంటు తీగలు వేలాడుతున్నాయి. ఈ విషయం పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలియ జేసినప్పటికీ కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాడుతున్న విద్యుత్ తీగలతో ఏ ప్రమాదం పొంచి వస్తుం దోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి పెను ప్రమాదం జరగకముందే వేలాడుతున్న తీగలను తొలగించాలని కోరుతున్నారు.



విద్యుత్ వైర్లను చూపుతున్న గృహస్తులు



బహమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని సీతంపాలెం గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా గొడిచెర్ల వైద్యాధికారి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అప్తాల్మిక్ అధికారి మజ్జి గణపతిరావు నేత్ర పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 12 మందికి శస్త్ర చికిత్సలు, 48 మందికి కళ్ళజోళ్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని వచ్చే నెల 6న ఆపరేషన్స్ చేసేందుకు విశాఖలో ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు తరలిస్తామన్నారు.



పరీక్షిస్తున్న అప్తాల్మిక్ అధికారి

సరుకులు, దుస్తులు పంపిణీ



దుస్తులు అందజేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కవగుంట పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ ఎలక్ట్రీషియన్లకు సర్పంచు దాసరి సూర్య కుమారి వరహాలు చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందించి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామం పరిశుభ్రంగా ఉందంటే ఇందుకు పారిశుద్ధ్య కార్మికులే కారణమని కొనియాడారు. ఎంతో శ్రమించి పారిశుధ్య పనులు చేపడుతుంటారని తెలిపారు. ఇటువంటి సేవకులను గుర్తించుకోవడం సాంప్రదాయ పద్ధతిగా గుర్తించాలన్నారు. కరెంటు సమస్యకు అధికారుల చుట్టూ తిరగకుండా గ్రామస్థాయిలోనే పరిష్కరించుకునేందుకు ఎలక్ట్రీషన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు రొబ్బా వరకుమారి, ప్రగడ నాగేశ్వరావు, స్కూల్ చైర్మన్ నాయుడుబాబు, రాజన్న యూత్ అధ్యక్షులు చేపూరి శేషు, గ్రామ పెద్దలు వెచ్చం చిన్న నాగరాజు, వీపు అప్పారావు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని చటర్జీపురం గ్రామంలో రెండు పూరిళ్ళు కాలిపోయాయని సామాజిక మధ్యమాల్లో చూసిన అల్లూరి యువ గిరిజన సేవ సంఘం అధ్యక్షుడు మల్లేష్, బట్టలు షాప్ అధినేతలు గోపి, తహీబ్‌బాబు, ప్రసాద్‌ల సహకారంతో మంగళవారం బియ్యం, కిరాణా సామాన్లు, కూరగాయలు, బట్టలు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యువ గిరిజన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి పి.సన్యాసిరావు, జిగ్‌సా గోపి, వర్షిణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

గ్రామాల్లో తీర్థాల సందడి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగుంపేటలో తీర్థ మహోత్సవంను హనుమాన్ యూత్, జోగంపేట మాజీ సర్పంచ్ వరహాలబాబు, వైసిపి నాయకులు జువ్వల దేముడు, ఉప సర్పంచ్ లాలం స్వామినాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా గొలుగొండ మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, నర్సీపట్నం డాక్టర్ రాయపురెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. తీర్థ మహోత్సవంను విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు నిర్వాహకులు ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాలం చినబాబులు, హనుమాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సిహెచ్.నాగపురంలో మంగళవారం తీర్థం మహోత్సవం సర్పంచ్ యలమంచిలి రఘు రాంచంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు సందడి చేశారు.



బహుమతులు ఇస్తున్న సూర్యనారాయణరాజు

ముగిసిన క్రికెట్ లీగ్ పోటీలు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో ఈనెల 12 నుండి ప్రారంభమైన క్రికెట్ లీగ్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. గారా ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో చివరి రోజు ఫైనల్లో చెరుకూరి, రావాడ టీములు పోటీ పడగా రావాడ టీం విజయం సాధించింది. ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలలో గెలుపొందిన విజేతలకు మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి రూ.20,000, ద్వితీయ బహుమతి రూ.10,000 తృతీయ బహుమతి రూ.5000 చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ, క్రీడల పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్రీడలతో మానసిక వికాసంతో పాటు శారీరక దారుడ్యాన్ని కూడా పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, వివిధ జట్ల మేనేజర్లు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డిఎస్‌పి

కొట్లాటలో 20మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి -మాకవరపాలెం:జి.వెంకటాపురం శివారు నగరం గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన కొట్లాట కేసుపై డిఎస్పి ప్రవీణ్ కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. ఇరు వర్గాల వారిని విడి విడిగా విచారణ చేశారు. రెండు వర్గాల మధ్య గొడవ ఎందుకు వచ్చింది అనే దానిపై విచారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇరు వర్గాలకు చెందిన 20మందిపై కేసు నమోదు చేశామన్నారు. త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. గ్రామస్తులు ప్రశాంత వాతావరణంలో ఉండాలన్నారు. సమస్యలు ఉంటే చర్చించుకోవాలి తప్ప ఇలా తగాదాలకు దిగకూడదని సూచించారు. గ్రామంలో నిఘా పెట్టాలని ఎస్సై రామకృష్ణారావుకి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమణయ్య, దళిత సంఘం నాయకులు అప్పలరాజు, చలపతి రావు పాల్గొన్నారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో సీతారామరాజు, ఈ ఓపిఆర్‌డి వెంకటనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, నక్కపల్లి సంపద తయారీ కేంద్రం శిక్షణ కేంద్రంగా ఎంపికైందని, చెత్త నిర్వహణపై పలు మండలాలకు సంబంధించి ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని మౌలిక సదుపాయాలతో షెడ్డు నిర్మాణానికి సంబంధించి మిగిలిన పనులు వేగ వంతంగా పూర్తి అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు సూచించారు. కేంద్రం చుట్టూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఉప సర్పంచ్ వీసం రాజు పాల్గొన్నారు.

కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తి

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కొత్తకోట:భీమునిపట్నం -నర్సీపట్నం రోడ్డులో కల్వర్టు నిర్మాణ పనులను ఎట్టకేలకు అధికారులు పూర్తి చేయించారు. గత వారం రోజులుగా జరుగుతున్న వరస రోడ్డు ప్రమాదాలపై మంగళవారం గాలిలో ప్రజల ప్రాణాలు అనే కథనం ప్రజాశక్తిలో రావడంతో ఆర్అండ్‌బి శాఖ అధికారుల్లో చలనం వచ్చింది. ఈనెల 11న రాత్రి భార్యా భర్తలు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు కాగా, ఆదివారం రాత్రి కోటవురట్ల గ్రామానికి చెందిన వ్యక్తి టి.అర్జా పురం సమీపంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టులో ప్రమాదవ శాత్తు పడి తీవ్ర గాయలతో ఆసుపత్రి లో మృతి చెందిన సంఘటి తెలిసిందే. దీంతో వాహనదారులు ఈ రోడ్డు లో ప్రయాణం చేయాలంటేనే బెంబేలైతి పోవడంతో పాటు పలువురు విమర్శలు వ్యక్తం చేశారు. అధికారులు తాత్కాలికంగా దొండపూడి, టి.అర్జాపురం, పి. పొన్నవోలు, మేడివాడ గ్రామాల సమీపంలో సగం సగం నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులను వేగవంతం చేసి జేసిబి యంత్రంతో పూర్తి చేయించారు.



కల్వర్టు వద్ద చదును చేయించిన అధికారులు

నేటి తరానికి జ్యోతిబసు జీవితం ఆదర్శం



మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి కుమార్

ప్రజాశక్తి- యంత్రాంగం

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు యోధుడు జ్యోతి బసు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. అనకాపల్లి, విశాఖ జిల్లాలో పలు చోట్ల మంగళవారం జోతిబసు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

కలెక్టరేట్, విశాఖ: సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు మార్గమే ఈ దేశానికి సరైనదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన జ్యోతిబసు 13వ వర్ధంతిని మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు. ముందుగా జ్యోతిబసు చిత్రపటానికి లోకనాథం, జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, ఎం.సుబ్బారావు, వి.నరేంద్ర కుమార్, డి.అప్పలరాజు, జివిఎన్.చలపతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ, భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన జ్యోతిబసు పార్టీని బలోపేతం చేయడంలో, సంపూర్ణ స్వాతంత్ర ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కోల్‌కతా రైల్వే కార్మికుల యూనియన్ నాయకునిగా బాధ్యతగా వ్యవహరించి కార్మిక హక్కుల కోసం అనేక సమ్మెలు, పోరాటాలు నిర్వహించారని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి 2000 వరకు 23 ఏళ్ల పాటు సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించి ప్రపంచ రికార్డు సృష్టించారన్నారు. వ్యవసాయ రంగంలోనూ, ఉపాధి కల్పనలోను అభివృద్ధి సాధించారని తెలిపారు. పారిశ్రామిక దశకు వెళ్లేసరికి తృణమూల్ కాంగ్రెస్ రైతులను రెచ్చగొట్టి వామపక్ష ప్రభుత్వాన్ని కూలదోసిందని విమర్శించారు. జ్యోతిబసు ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందన్నారు. యువతకి ఉపాధి కల్పన, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో విఫలమైందన్నారు. 33 ఏళ్ల పాలనలో అవినీతిలేని పాలన సిపిఎం అందిస్తే, నేడు అవినీతి, దౌర్జన్యంతో కూడిన పాలన సాగుతోందన్నారు. పేదల పక్షాన నిలబడుతున్న ఎర్రజెండా కార్యకర్తలపై తృణమూల్ కాంగ్రెస్, బిజెపి, ఆర్ఎస్ఎస్ పెద్ద ఎత్తున దాడికి పూనుకున్నాయని తెలిపారు. నేడు భారతదేశంలో మోడీ ప్రభుత్వం పేద రైతులకు భూములు పంపిణీ చేయకుండా, ఉన్న భూములను లాక్కొని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం వల్ల వ్యవసాయరంగం పూర్తిగా నాశనం అవుతుందన్నారు. దోపిడీ రాజ్యం పోయి, ఎర్ర జెండా అధికారంలోకి వస్తేనే దేశం అభివృద్ధి జరుగుతుందని జ్యోతిబసు నమ్మిన సిద్ధాంతం అని, ఆ సిద్ధాంతానికి కట్టుబడి సిపిఎం కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.వెంకటరావు, కె.కుమారి, ఎం.సూరీడు, వై.రాజు, దండు నాగేశ్వరరావు, పి.శంకరావు తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో సిఐటియు జాతీయ మహాసభలకు హాజరైన డెలిగేట్స్ మంగళవారం ఆర్‌కెఎస్‌వి కుమార్ అధ్యక్షతన జ్యోతిబసు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎపి రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, జ్యోతిబసు కార్మిక వర్గానికి స్ఫూర్తి ప్రధాత అన్నారు. ఆయన చేసిన పోరాటాలు ఫలితంగా కార్మిక చట్టాలు అనేవి రక్షింపబడ్డాయన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌వి.నరసింహులు మాట్లాడుతూ, కార్మికులు తన హక్కుల కోసం పోరాడి జ్యోతిబసు ఆశయాలను నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తేజ, జగన్, లక్ష్మణమూర్తి, చంద్రమౌళి, అనసూయ, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి :

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ జ్యోతి బసు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో మంగళవారం జ్యోతి బసు 13వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం అగ్ర నేతగా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా దేశంలోనే ఆదర్శవంతమైన నేతగా జ్యోతి బసు పేరు తెచ్చుకున్నారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కార్మిక కర్షకవర్గం కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు. జ్యోతి బసు మరణానంతరం కూడా ఆయన పార్థివ దేహాన్ని కల్‌కతా వైద్య కళాశాలకు ఇచ్చి తమ ఆదర్శాన్ని నిరూపించుకున్నారన్నారు. తన రాజకీయ జీవితంలో ప్రధానమంత్రి పదవి వచ్చిన పార్టీ ఆదేశాల మేరకు తృణప్రాయంగా త్యజించి మచ్చలేని నాయకునిగా నిలిచారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో విశాఖ కేంద్రంగా జ్యోతి బసు దేహ దారణ ప్రోత్సాహక సంస్థ ఏర్పాటు చేసి 13 ఏళ్లుగా విశాఖ ఆంధ్ర మెడికల్ కళాశాలకు కమ్యూనిస్టులు, వారి కుటుంబాలు కార్యకర్తలు, అభ్యుదయ వాదులు మరణానంతరం వారి దేహాలను దానం చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం కార్యదర్శి ఎ.బాలకృష్ణ, వత్తిదారుల సంఘం నాయకులు గంట శ్రీరామ్, సిఐటియు నాయకులు తేలయ్య బాబు, బి ఉమామహేశ్వరరావు, ఎం నాగేశ్వరరావు, బి నూక అప్పారావు, ఈశ్వరరావు, ఎం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



పరవాడలో నివాళులర్పిస్తున్న నాయకులు



అనకాపల్లిలో మాట్లాడుతున్న బాలకృష్ణ

పరవాడ : ఫార్మాసిటీలో మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో జ్యోతి బసు 13వ వర్ధంతి నిర్వహించారు. జ్యోతి బసు చిత్రపటానికి సిఐటియు నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రైల్వే కార్మికుల సమస్యలపై జ్యోతిబసు అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. భారతదేశంలో అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించిన జ్యోతి బసు చూపించిన బాటలో కార్మిక వర్గం ప్రయణించాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కర్రి ఎంకునాయుడు, కర్రి పెంటారావు, కె.కృష్ణ, పి అప్పారావు, ఏ రాజు తదితరులు పాల్గొన్నారు.